
ఆంధ్రజ్యోతి
వరంగల్ ఉమ్మడి జిల్లా
5
శుక్రవారం 15 నవంబరు 2024



కార్తీక శోభితం..

నిండుపౌర్ణమి వేళ అభిషేకాలు, దీపోత్సవాలు

- నేటి వేడుకలకు ముస్తాబైన శైవ క్షేత్రాలు, ఆలయాలు
- వేయిస్తంభాల గుడిలో లక్షదీపార్చన
- హాజరుకానున్న మంత్రి కొండా సురేఖ


హనుమకొండలో దీపాలు, ఉసిరి కొనుగోలు చేస్తున్న మహిళలు


ఉత్సవాలకు సిద్ధమైన కొడవటూరు సిద్దులగుట్ట

హనుమకొండ కల్చరల్/ వరంగల్ కల్చరల్/ జనగామ కల్చరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : శివకేశవులకు ప్రీతికరమైన.. పవిత్ర కార్తీక మాసంలో కృత్తికా నక్షత్రంలో నిండు పౌర్ణమి వేళ వచ్చే కార్తీక పౌర్ణమి పర్వదినం కోసం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న శైవక్షేత్రాలు, ఆలయాలు ముస్తాబయ్యాయి. శుక్రవారం తెల్లవారుజాము నుంచే ప్రత్యేక అభిషేకాలు, పూజలు, దీపోత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ప్రతీ ఇంటా భక్తులు ఉసిరిక స్నానాలు చేయడం, బ్రహ్మీ ముహూర్తంలో తెల్లవారుజామునే అభ్యంగన స్నానాలు చేసి కార్తీక వొత్తులు వెలిగించుకోవడం సంప్రదాయంగా వస్తోంది. ఇంటింటా లక్ష్మీదేవిగా కొలుస్తూ తులసీ మాతకు కార్తీక దీపాలు వెలిగించి పూజలు చేయడం ఈ పర్వం ప్రత్యేకత. దీపావళి నుంచి ప్రారంభమయ్యే కార్తీక మాస పూజలు పౌర్ణమి రోజున మరింత విశిష్టంగా జరుగుతాయి. దీనికి తోడు కార్తీక పౌర్ణమి రోజున శ్రీ రమా సత్యనారాయణ స్వామి వ్రతాలను ఆచరించడం కూడా అనాదిగా వస్తోంది. కార్తీక పూజల్లో ముఖ్యమైన ఉసిరి కొమ్మలు, కాయలతో పాటు పూలు, వివిధ రకాల పండ్ల అమ్మకాలతో నగరంలో సందడి కనిపించింది. హనుమకొండ, వరంగల్ చౌరస్తాలతో పాటు అనేక ప్రధాన కూడళ్లలో రద్దీ కనిపించింది. అలాగే జనగామ, ములుగు, భూపాలపల్లి, మహబూబాబాద్ జిల్లా కేంద్రాలతో పాటు పలు పట్టణాలు, మండల కేంద్రాల్లోని పలు ఆలయాలను, ప్రసిద్ధ శైవ క్షేత్రాలను ముస్తాబు చేశారు. తెల్లవారుజామునుంచే భక్తులు స్వామివార్లను దర్శించుకునేలా, అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేసేలా ఏర్పాట్లు చేశారు.

వేయిస్తంభాల ఆలయంలో ఇలా..

వేయిస్తంభాల ఆలయంలో ప్రత్యేకంగా లక్ష దీపోత్సవాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్ర శర్మ తెలిపారు. దేవాదాయ శాఖ సహకారంతో ఉదయం 5గంట నుంచి స్వామివారికి రుద్రాభిషేకాలు, సామూహిక రుద్రాభిషేకాలు నిర్వహిస్తారు. సాయంత్రం 6 గంటలకు జరిగే లక్షదీపోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ సహా పలువురు

మిగతా 6వ పేజీలో...

కాళేశ్వరంలో ప్రత్యేక పూజలు

మహదేవపూర్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయంలో కార్తీకమాసం పర్వదినం సందర్భంగా గురువారం వైకుంఠ చతుర్దశి పూజలు జరిగాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు పెద్ద ఎత్తున తరలి ముందుగా గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించారు. గోదావరిమాతకు చీర, సారె, కుంకుమ, పసుపులతో ప్రత్యేక పూజలు చేశా రు. అనంతరం కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, మహన్యాసాక పూర్వాభిషేకం, రుద్రాభిషేకం, శుభానందదేవి ఆలయంలో అమ్మవారికి కుంకమ పూజలు నిరవహించారు. సరస్వతిదేవి ఆలయంలో పలు ప్రత్యేక పూజలు చేశారు. ఉసిరిక చెట్టు వద్ద లక్ష ముగ్గు లు వేసి లక్ష వత్తులతో దీపాలను ముట్టించి బ్రాహ్మణోత్తములను దీపా దానం అందజేశారు. శుక్రవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా తెల్లవారుజామునుంచే ప్రత్యేక అభిషేకాలు, ప్రత్యేక పూజలు, దీపోత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు.


కాళేశ్వరం ముక్తీశ్వరాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ముగిసిన జోనల్ స్థాయి క్రీడలు



గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందిస్తున్న దృశ్యం

రాయపర్తి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాయపర్తి మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో నిర్వహిస్తున్న జోనల్ స్థాయి క్రీడా పోటీలు గురువారం ముగిశాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో క్రీడల్లో గెలుపొందిన విద్యార్థినులకు బహుమతులను ప్రదానం చేశారు. అండర్ -19 ఖోఖో విభాగంలో రాయపర్తి ప్రథమ స్థానంలో నిలవగా, ద్వితీయ స్థానంలో ధర్మసాగర్ నిలిచింది. ఖోఖో అండర్-14 విభాగంలో విన్నర్‌గా మడికొండ, రన్నర్‌గా రాయపర్తిలు నిలిచాయి. వాలీబాల్ అండర్-19 విభాగంలో విన్నర్‌గా పరకాల, రన్నర్‌గా పర్వతగిరి నిలిచాయి. అండర్-19 హ్యాండ్‌బాల్ పోటీల్లో విన్నర్‌గా రాయపర్తి, రన్నర్‌గా మడికొండ ఉన్నాయి. అండర్-19 విభాగంలో టిని కైట్ పోటీల్లో విన్నర్‌గా మడికొండ, రన్నర్‌గా ఎల్కతుర్తి నిలిచాయి. డిస్కత్రో విభాగంలో ఇనుగుర్తికి చెందిన హైమావతి మొదటి స్థానంలో నిలవగా, రెండో స్థానంలో ఐశ్వర్య నిలిచింది. షార్ట్‌పుట్‌లో హైమావతి మొదటి స్థానంలో నిలిచింది. ఆసక్తిగా సాగిన ఈ క్రీడలకు ప్రతీ ఒక్కరు కష్టపడి పనిచేశారని వరంగల్ డీసీవో అపర్ణ అన్నారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సరిత, ఉపాధ్యాయులు, పీఈటీలు పాల్గొన్నారు.

కుల గణనకు వ్యతిరేకంగా బీజేపీ కుట్రలు

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్



సంఘీభావం తెలుపుతున్న నాయకులు

కాజీపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం చేపట్టిన కులగణకు వ్యతిరేకంగా బీజేపీ కుట్రలు చేస్తుందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ మండిపడ్డారు. కులగణన చైతన్య యాత్రలో భాగంగా గురువారం కాజీపేట ఫాతీమానగర్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ అధ్యక్షతన రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడారు. కులగణనను వ్యతిరేకిస్తున్న పార్టీలకు పుట్టగతులు ఉండవన్నారు. బీసీ రిజర్వేషన్‌ల పెంపునకే ప్రభుత్వం కులగణన చేపట్టిందన్నారు. కులగణన కోసం వచ్చే అధికారులకు ఆటంకం కలిగించవద్దన్నారు. అగ్రకులాల కుట్రలను తిప్పికొట్టాలన్నారు. బీసీలు కులగణనలో కులం నమోదు చేసుకోవాలన్నారు. జాతీయ అధికార ప్రతినిధి తీగల ప్రదీప్ గౌడ్, రాష్ట్ర అధ్యక్షుడు రవికృష్ణ గౌడ్‌లు మాట్లాడారు. స్థానిక ఎన్నికల్లోపు కులగణన పూర్తి చేయాలన్నారు. ప్రొఫెసర్ కూరపాటి మాట్లాడుతూ.. ప్రభుత్వం కులగణపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. రాజ్యాధికారం సాధించేవరకు ఉద్యమాలు కొనసాగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కుల్క చర్ల శ్రీనివాస్ ముదిరాజ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాడి మల్లయ్య యాదవ్, బచ్చు ఆనందం, నాయకులు బోనగాని యాదగిరి గౌడ్, ఎడునూరి రాజమౌళి పాల్గొన్నారు.

స్వచ్ఛ ఆటో డ్రైవర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

వడ్డెపల్లి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఔట్ సోర్సింగ్ ద్వారా మునిసిపాలిటీలో పనిచేస్తున్న స్వచ్ఛ ఆటో డ్రైవర్లందరికీ ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు పర్మినెంట్ ఐడీ నెంబరు ఇవ్వాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అథవాలే) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎర్ర చంద్రమౌళి, స్వచ్ఛ ఆటో డ్రైవర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు పల్లెబోయిన మురళీకృష్ణ సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. గురువారం బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో వారు మాట్లాడారు. స్వచ్ఛ ఆటోలను కార్పొరేషన్‌లో విలీనం చేసుకొని, ప్రతీ డ్రైవర్‌కు నెలకు రూ. 25000 వేతనం చెల్లించాలని కోరారు. సమావేశంలో యూనియన్ నాయకులు బుర్ర విజయ్ కుమార్, మట్టెడ సురేందర్, వక్కల కుమార్, సుభాష్, చంద్రబోస్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులపై దాడులను ఖండించాలి

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి
- వరంగల్, హనుమకొండ కలెక్టరేట్ల వద్ద ఉద్యోగుల నిరసన



హనుమకొండలోఉద్యోగుల నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని



వరంగల్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఉద్యోగులు

హనుమకొండ కలెక్టరేట్, నవంబరు14(ఆంధ్రజ్యోతి): అధికారులపై దాడులను పార్టీలకతీతంగా ఖండించాలని పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. విధి నిర్వహణలో ఉన్న వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, ఇతర అధికారులపై జరిగిన దాడికి నిరసనగా జిల్లా ఉద్యోగ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో గురువారం హనుమకొండ కలెక్టరేట్ ఆవరణలో భోజన విరామ సమయంలో ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించిన నిరసన తెలిపారు. నిరసనకు సంఘీబావం తెలిపిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.. చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవాలని చూస్తే ఎవరినీ వదిలిపెట్టేది లేదన్నారు. ప్రతిపక్షపార్టీల నాయకులు ప్రయోజనాలను పక్కనపెట్టి తమ రాజకీయ మనుగడ కోసం చూస్తున్నారని, ఇలా చేయడం సరైంది కాదన్నారు. హనుమకొండ జిల్లాలో అధికారిపై ఇలాంటి చర్యలకు పాల్పడితే వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో జిల్లా జేఏసీ ఛైర్మన్ ఆకుల రాజేందర్, గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు అన్నమనేని జగన్ మోహన్‌రావు, జిల్లా అధికారుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ కుమార్, ట్రెసా అధ్యక్షుడు భాస్కర్, పీఆర్‌టీయూ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, టీఎన్‌జీఓస్ కార్యదర్శి బైరి సోమయ్య, అసోసియేట్ అధ్యక్షులు పుల్లూరు వేణుగోపాల్, కోశాధికారి పనికెల రాజేష్, గెజిటెట్ అధికారుల సంఘం నేతలు మురళీధర్‌రెడ్డి, డాక్టర్ ప్రవీణ్ కుమార్, అన్వర్, చంద్రశేఖర్, పెన్షనర్ల సంఘం నాయకులు, ఉద్యోగ సంఘాల నాయకులు, వివిధ శాఖల ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొన్నారు.

దాడులు జరిగితే సహించేది లేదు

వరంగల్ కలెక్టరేట్: ప్రభుత్వం ఏది ఆదేశిస్తే దానికి అనుగుణంగా పనిచేయడమే ప్రభుత్వ ఉద్యోగుల విధి అని, అలాంటి ఉద్యోగులపై దాడి చేయడం హేయమైన చర్య అని ఉద్యోగ సంఘాల జేఏసీ ఛైర్మన్, వరంగల్ జిల్లా టీఎన్‌జీవోస్ అధ్యక్షుడు గజ్జెల రామ్‌కిషన్ అన్నారు. గురువారం టీఎన్‌జీవోస్ ఆధ్వర్యంలో మధ్యాహ్నభోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా రామ్‌కిషన్ మాట్లాడుతూ.. వికారాబాద్ జిల్లాలో కలెక్టర్‌తో పాటు ఇతర అధికారులపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇక ముందు ఉద్యోగులపై దాడులు జరిగితే సహించేది లేదని, ప్రభుత్వం కూడా దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ట్రెసా జిల్లా అధ్యక్షుడు గనిపాక రాజ్‌కుమార్ మాట్లాడుతూ.. నిరసనలు తెలపాలనుకుంటే చాలా మార్గాలు ఉన్నాయని, కేవలం దాడి అనేది సరైన మార్గం కాదన్నారు. జిల్లా కలెక్టర్‌కే రక్షణ లేనప్పుడు సామాన్య ఉద్యోగుల పరిస్థితి ఒక్కసారి ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో టీఎస్‌జీవో జిల్లా కార్యదర్శి గాజె వేణుగోపాల్, ట్రెసా రాష్ట్ర అధ్యక్షుడు రియాజుద్దీన్, కోశాధికారి పాలకుర్తి సదానందం, రామానుజన్, జగదీశ్వర్, రాజు, దుర్గారావు, ఇంద్రసేనారెడ్డి, మధుచంద్ర, గణేష్, నూతన ప్రసాద్, భానుప్రకాశ్, శెంకేసి రాజేష్, శ్రీనివాస్, యాకూబ్ నాయక్, సదానందం, వీరన్న, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

వర్సిటీలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు అండగా నిలుస్తా..

- కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి
- సంఘం ఆధ్వర్యంలో వీసీకి ఘన సన్మానం



వీసీని సన్మానిస్తున్న ఎస్సీ,ఎస్టీ ఉద్యోగుల సంఘం నేతలు

కేయూక్యాంపస్, నవంబరు 14,(ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు అండగా నిలిచి న్యాయం చేస్తానని కేయూ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం రాత్రి కేయూ సెనెట్‌హాల్‌లో కేయూ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ప్రొఫెసర్ ఈసం నారాయణ, డాక్టర్ పుల్లా శ్రీనివాస్ నేతృత్వంలో వీసీగా బాధ్యతలు చేపట్టిన ప్రతాప్‌రెడ్డికి ఘన సన్మానం చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. వర్సిటీలో ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తానని స్పష్టం చేశారు. ఉద్యోగులకు రావాల్సిన అన్ని బెనిఫిట్స్, ప్రమోషన్లను వచ్చేలా చేస్తానని హామీ ఇచ్చారు.

ఈసం నారాయణ, పుల్లా శ్రీనివాస్‌లు మాట్లాడుతూ.. రిజిస్ట్రార్, పరీక్షల నియంత్రణాధికారిలాంటి పోస్టులకు ఎస్సీ, ఎస్టీ ప్రొఫెసర్లకు రొటేషన్ ప్రకారం కేటాయించాలన్నారు. వర్సిటీలో బ్లాక్‌లాగ్ పోస్టుల భర్తీకి తక్షణమే కమిటీ ఏర్పాటు చేసి చర్యలు చేపట్టాలని అన్నారు. నాలుగేళ్లుగా వర్సిటీలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల పట్ల వివక్ష చోటు చేసుకుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ అధ్యాపక, అధ్యాపకేతర, పరిశోధకులు, విద్యార్థుల పట్ల అణచివేత కుట్ర జరిగిందని ఉదాహరణతో సహా సభలో వెల్లడించారు. ఎస్సీ, ఎస్టీలకు ఆర్టికల్ 14, 16 మేరకు రావాల్సిన హక్కులు, పదోన్నతులకు అప్పటి వర్సిటీ ఉన్నతాధికారులు అడ్డుకున్నారని మండిపడ్డారు. ప్రశ్నిస్తే బదిలీల పేరుతో బెదిరింపులకు గురిచేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. కొన్నేళ్లుగా బోధనేతర ఉద్యోగుల ప్రమోషన్లు కుట్రపూరితంగా అపారని, పరీక్షలు నిర్వహించి ఉద్యోగుల పదోన్నతుల ఫలితాలు ఇవ్వకుండా అడ్డుకున్నారని అన్నారు. వర్సిటీ అన్ని ఏరియాల్లో తమకు ప్రత్యేక రాయితీలు కల్పించకుండా ఎస్సీ, ఎస్టీలను అణగతొక్కారని ధ్వజమెత్తారు. ఎస్డీఎల్‌సీఈలో పీహెచ్‌డీ కల్గిన ఎస్సీ, ఎస్టీలకు కో-ఆర్డినేటర్లుగా పదోన్నతి కల్పించాలని కోరారు. తమ సమస్యల పరిష్కరించకుంటే

ఈ సందర్భంగా వీసీ ప్రతాప్‌రెడ్డిని గజమాల, జ్ఞాపిక అందచేసి ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం అధ్యక్షకార్యదర్శులు ప్రొఫెసర్ ఈసం నారాయణ, డాక్టర్ పుల్లా శ్రీనివాస్, పాలక మండలి సభ్యులు, వర్సిటీ న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నిమ్మ సుదర్శన్, ఎస్డీఎల్‌సీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, కేయూ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ కొట్టే భాస్కర్, కేయూ మహిళ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.బిక్షాలు, డాక్టర్ సంగాల ఎప్రామ్‌రాజ్, నేతలు సంగాల దయాకర్, కిరణ్, నర్మెట్ల అయిలయ్య, ప్రతాప్, భాస్కర్, రాజు నాయక్, బొక్క మొగిలి, కొత్తగూడెం ఇంజనీరింగ్ కళాశాల ఉద్యోగ సంఘం నేత శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

లగచర్ల రైతులను బేషరతుగా విడుదల చేయాలి

వడ్డెపల్లి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కొడంగల్ నియోజకవర్గంలోని లగచర్ల, హకీంపేట, పోలెపల్లి రైతులపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేసి వారిని బేషరతుగా విడుదల చేయాలని విముక్తి చిరుతల కక్షి (వీసీకే) పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జిలుకర శ్రీనివాస్ డిమాండ్ చేశారు. రైతులను విడుదల చేయాలని డిమాం డ్ చేస్తూ వీసీకేతోపాటు ప్రజాసంఘాల నాయకులు గురువారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్ ప్రాంతంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా జిలుకర శ్రీనివాస్‌తోపాటు గద్దర్ విగ్రహ కమిటీ జిల్లా అధ్యక్షుడు కోండ్ర నర్సింగరావు, డీబీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చుంచు రాజేందర్ మాట్లాడు తూ.. ఫార్మా కంపెనీ ప్రతిపాదనలను ప్రభుత్వంఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు మచ్చ దేవేందర్, జోరిక రమేష్, చెరిపల్లి ఆనంద్, రవి తదితరులు పాల్గొన్నారు.

మహిళా మావోయిస్టు లొంగుబాటు

- అనారోగ్యంతో లొంగిపోయిన మంజుల అలియాస్ నిర్మల
- 20 ఏళ్లుగా వివిధ కేడర్‌లలో పీపుల్స్‌వార్‌లో విధులు
- రూ.20 లక్షల రివార్డు చెక్కు అందజేసిన సీపీ
- మావోలు జనజీవన స్రవంతిలో కలవాలని పిలుపు



లొంగిపోయిన మావోయిస్టుకు చెక్కును అందజేస్తున్న సీపీ

హనుమకొండ టౌన్, నవంబర్ 14 (ఆంధ్రజ్యోతి): అనారోగ్య కారణాలతో నిషేధిత సీపీఐ మావోయిస్టు పార్టీ స్పెషల్ జోనల్ కమిటీ మహిళా సభ్యురాలు కోడి మంజుల అలియాస్ నిర్మల గురువారం వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఎదుట లొంగిపోయారు. ఈ మేరకు వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయయంలో జరిగిన విలేకరుల సమావేశంలో సీపీ వివరాలు వెల్లడించారు.

వరంగల్ జిల్లా ఖానాపురం మండలం బుధరావుపేటకు చెందిన కోడి మంజుల తండ్రి పీపుల్స్‌వార్‌కు సానుభూతిపరుడిగా పనిచేయడంతో పాటు ఆమె అన్న కుమారస్వామి అలియాస్ ఆనంద్, దగ్గరి బంధువు కోడి వెంకన్న అలియాస్ గోపన్న నర్సంపేట దళ కమాండర్‌గా పనిచేసి ఎదురుకాల్పుల్లో మరణించారు. వారి ప్రభావంతో పాటు పీపుల్స్‌వార్ సిద్ధాంతాలకు ప్రభావితమైన మంజుల.. పదో తరగతిలోనే తన చదువును మధ్యలో ఆపేసి 1994లో సీపీఐ ఎంఎల్ పీపుల్స్‌వార్ గ్రూపు నర్సంపేట దళంలో చేరింది. ఆ తర్వాత చేర్యాల దళంలో పని చేసింది. 1999లో నర్సంపేట దళ కమాండర్ పెరం బుచ్చయ్యను వివాహం చేసుకుంది. 2000లో బుచ్చయ్య పోలీసుల ఎదుట లొంగిపోయాడు. అనంతరం 2001లో మాచర్ల ఏసోబు అలియాస్ జగర్ సారథ్యంలో ప్రెస్ టీం ప్రొటెక్షన్ ప్లాటూన్‌లో యేడాది పనిచేసి 2002లో మహదేవపూర్ డిప్యూటీ దళ కమాండర్‌గా పనిచేస్తున్న క్రమంలో డివిజనల్ కమిటీ మెంబర్ కుకటి వెంకట్ అలియాస్ రమేశ్‌ను వివాహం చేసుకుంది. వైద్యం కోసం మరో మహిళా దళ సభ్యురాలితో భూపాలపల్లికి వచ్చి 2002 డిసెంబర్ 24 పోలీసులకు పట్టుబడి జైలుకు వెళ్లింది.

2004లో జైలు నుంచి విడుదలై తిరిగి మావోయిస్టులతో సంబంధాలు కొనసాగిస్తూ మహదేవపూర్ దళ సభ్యురాలిగా బాధ్యతలు చేపట్టింది. 2005లో మహదేవపూర్, చేర్యాల, మహరాష్ట్ర, సిరోంచ, డిప్యూటీ కమాండర్‌గా పనిచేసింది. 2007 నుంచి మణుగూర్ దళ కమాండర్‌తో పాటు పార్టీ ఆదేశాల మేరకు దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ పరిధిలో ఏరియా కార్యదర్శిగా, వైద్య బృందానికి బాధ్యురాలిగా 2011 వరకు పనిచేసింది. అ తర్వాత 2021 వరకు బస్తర్‌లో వివిధ క్యాడర్‌లో పనిచేసి 2022లో స్పెషల్ జోనల్ కమిటీ సభ్యురాలుగా మంజుల బాధ్యతలు స్వీకరించింది. 2013లో దర్బా డివిజన్‌లో జీరంఘాటి ప్రాంతంలో 27 మంది పోలీసులను హత్య చేసిన సంఘటనతో పాటు చిట్యాల, నర్సంపేట, ఏటూరునాగారం, నెక్కొండ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో పోలీసులుపై జరిపిన కాల్పుల్లో మంజుల నిందితురాలిగా ఉంది.

కాగా, అనారోగ్య సమస్యలతో పాటు, తెలంగాణ ప్రభుత్వం కల్పిస్తున్న పునరావసం పట్ల ఆకర్షితులై మంజుల లొంగిపోయారని సీపీ తెలిపారు. కాగా, ఆమెపై ప్రభుత్వం ప్రకటించిన రూ.20 లక్షల రివార్డు చెక్కును అందజేశామన్నారు. తెలంగాణలో నక్సలిజంకు ఎలాంటి ఆదరణ లేదని, అజ్ఞాతంలో ఉన్న మావోయి స్టులు జనజీవన స్రవంతిలో కలిసి కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలని ఈ సందర్భంగా సీపీ సూచించారు. ఈ సమావేశంలో ఈస్ట్‌జోన్ డీసీపీ రవీందర్, ఏసీపీలు జితేందర్‌రెడ్డి, కిరణ్ కుమార్, ఎస్సై రఘుపతి పాల్గొన్నారు.

కార్తీక శోభితం..

(5వ పేజీ తరువాయి)

ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు పాల్గొననున్నారు. ఈ మేరకు గురువారం ఆలయాన్ని విద్యుత్ దీపాలతో శోభాయమానంగా ముస్తాబు చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు వీలుగా ప్రత్యేక క్యూలైన్లను ఏర్పాటు చేశారు. వీటితోపాటు కళాబృందాల సంప్రదాయ నృత్యాలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు కూడా ఉంటాయి. అలాగే హనుమకొండలోని షిరిడీ సాయిబాబా ఆలయం, ములుగు రోడ్డులోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం, దత్తక్షేత్రం, కాజీపేటలోని శ్వేతార్కమూల ఆలయం, హనుమకొండ రాగన్న దర్వాజలోని శ్రీ సీతారామ ఆలయం, చిన్నకోవెల, ఎక్సైజ్‌కాలనీలోని శ్రీ వేంకటేశ్వరాలయం, బాలసముద్రంలోని శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలను నిర్వహించేందుకు ఆలయ కమిటీలు ఏర్పాటు చేశాయి. అలాగే వరంగల్ నగరంలోని శ్రీ వరద దత్తక్షేత్రంలో పౌర్ణమి హోమం, అభిషేకం నిర్వహించనున్నారు. శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలకు ఏర్పాట్లు చేశారు. శ్రీ భద్రకాళి అమ్మవారి దేవాలయంలో ప్రత్యేక పూజలు జరుగనున్నాయి. అలాగే అమ్మవారి ఆలయాల్లో విశేష పూజలు, సామూహిక లలిత సహస్ర నామ పారాయణం చేస్తారు.

మహిళలు ఆలయాల్లో వత్తులు కాల్చడంతో పాటు దీపాలు వెలిగించి నైవేద్యం నివేదన చేసి పూజలు చేయనున్నారు. 365 వత్తులు, 1008 వత్తులు, లక్ష వత్తులు కాలుస్తారు. పలుచోట్ల ప్రసాద వితరణకు ఏర్పాట్లు చేశారు. వరంగల్ భద్రకాళి ఆలయ రోడ్డులోని శ్రీ ధర్మశాస్తా అయ్యప్ప భక్త సేవాశ్రమంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆశ్రమ వ్యవస్థాపకుడు బ్రహ్మశ్రీ టీఆర్. బాలసుబ్రహ్మణ్య శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. తెల్లవారుజామున అభిషేకం, భక్తుల ముద్ర మాలలకు పూజ అనంతరం అయ్యప్ప భక్తుల మాలాధారణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మొదటిసారి అయ్యప్ప మాల వేసుకునే భక్తులకు ఉచితంగా మాలాధారణ చేసి స్వామి వారి శేషవస్త్రం, ప్రసాదం అందించనున్నట్లు ఆయన వివరించారు.

సోమేశ్వర ఆలయంలో అఖండజ్యోతి

కార్తీక పౌర్ణమి సందర్భంగా దక్షిణ భారతదేశంలో అఖండజ్యోతిని నిర్వహిస్తున్న మూడో దేవస్థానంగా పాలకుర్తి శ్రీసోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయానికి గుర్తింపు ఉంది. ఈ ఆలయంలో శుక్రవారం అఖండజ్యోతి గిరి ప్రదక్షిణకు ఏర్పాట్లు చేసినట్టు ఈవో సల్వాది మోహన్ బాబు తెలిపారు. అరుణాచలం స్ఫూర్తితో పాలకుర్తి ఆలయ గుట్టపై 8అడుగుల వెడల్పు, 4అడుగుల ఎత్తులో ప్రత్యేకంగా రూపొందించిన ప్రమిదలో ఒక టన్ను నువ్వులనూనె, ఆవునెయ్యి, రెండు క్వింటాళ్ల ముద్ద కర్పూరంతో అఖండజ్యోతిని వెలిగించనున్నట్లు తెలిపారు. వేలాదిగా తరలివచ్చే భక్తుల సమక్షంలో లక్ష దీపోత్స వం, గిరి ప్రదక్షిణ, అఖండజ్యోతి 5గంటలకు ప్రారంభ మవుతుందన్నారు. ఉత్తరకాశీ పీఠాధిపతి స్వామి స్థిత ప్రజ్ఞానంద సరస్వతి, రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే యశస్విని రెడ్డి హాజరై అఖండజ్యోతిని ప్రారంభిస్తారన్నారు.

అలాగే జనగామ బాణాపురం శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయంలో లక్ష దీప మహోత్సవం, కోటి దీపోత్సవం నిర్వహిస్తున్నట్లు ప్రధానార్చకులు కృష్ణమాచార్య సిద్ధాంతి తెలిపారు. బచ్చన్నపేట మండలం కొడవటూరు సిద్దుల గుట్ట కార్తీకపౌర్ణమి ఉత్సవాలకు ముస్తాబైంది. శుక్రవారం తెలవారుజాము నుంచే సిద్ధేశ్వరుడికి విశిష్ట అభిషేకాలు, అన్నపూజలు, మహారుద్రాభిషేకాలు నిర్వహించనున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్తీకదీపాలు వెలిగించనున్నారు. స్వామి సన్నిధిలో సత్యనారాయణ వ్రతాలు చేసి మొక్కులు చెల్లిస్తారు. ఆలయం వద్ద ప్రత్యేక ఏర్పాట్ల కోసం సిబ్బంది శ్రీనివాస్, చల్లా లక్ష్మీకాంతరెడ్డి, భానుప్రకాశ్‌రెడ్డిలను నియమించామని ఈవో చిందం వంశీ తెలిపారు.



కష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్తు

- విద్యార్థులతో వరంగల్ కలెక్టర్ సత్యశారద
- నర్సంపేటలో ఎస్సీ బాలుర విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ
- బాలికల హాస్టల్‌లో స్ఫూర్తి కార్యక్రమానికి హాజరు
- వైద్య కళాశాలలో వసతులు కల్పించాలని సూచన



నర్సంపేటలో సర్వేను పరిశీలించి ఎన్యూమరేటర్‌తో మాట్లాడుతున్న కలెక్టర్ సత్య శారద

నర్సంపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కష్టపడి చదివితేనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని వరంగల్ కలెక్టర్ సత్య శారద అన్నారు. బాలల దినోత్సవం సందర్భంగా నర్సంపేట పట్టణంలోని ఎస్సీ హాస్టల్‌లో రిటైర్డ్ రెవెన్యూ ఉద్యోగులు అందించిన దుప్పట్లు (రగ్గులు)ను హాస్టల్ విద్యార్థులకు అధికారులతో కలిసి పంపిణీ చేశారు. కొద్ది సేపు విద్యార్థులతో ముచ్చటించారు. ఉన్నత చదువులు చదివాక ఎలాంటి ఉద్యోగం చేస్తారని విద్యార్థులను అడిగి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. హాస్టల్‌లో ఇబ్బందులున్నా, ఏమైనా సమస్యలుంటే కాగితంపై రాసి ఫిర్యాదుపెట్టెలో వేస్తే పరిష్కరిస్తామని కలెక్టర్ విద్యార్థులకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా హాస్టల్ గదులను కలెక్టర్ పరిశీలించారు. ఇదే హాస్టల్ సమీపంలో మునిసిపాలిటీ ఆధ్వర్యంలో ఎన్యూమరేటర్లు నిర్వహిస్తున్న కుటుంబ సర్వేను కలెక్టర్ పరిశీలించారు. కుటుంబ వివరాలను నమోదు చేస్తున్న ఫారాలను నిశితంగా పరిశీలించి సర్వేను పారదర్శకంగా చురుకుగా నిర్వహించాలని సూచించారు.

సమగ్ర కుటుంబ సర్వే పరిశీలన

పట్టణంలోని సర్వాపురం శివారులోని బాలికల హాస్టల్‌ను కలెక్టర్ సందర్శించారు. బాలల దినోత్సవం సందర్భంగా జిల్లాలో ప్రప్రథమంగా బాలికల హాస్టల్‌లో స్ఫూర్తి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ సత్యశారద మాట్లాడుతూ.. సెల్‌ఫోన్ అలవాట్లను మానుకొని పట్టుదలతో చదివితే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. తాము చదువుకున్న సమయంలో ఎలాంటి వసతులు లేవని, ఎన్నో ఎదురుదెబ్బలు తిని చదువుకొని కలెక్టర్ స్థాయికి వచ్చామని విద్యార్థులకు వివరించారు. ఇప్పుడు అన్ని రకాల సౌకర్యాలు ఉన్నాయని, చదువు విలువను గుర్తించి విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కలెక్టర్ సత్యశారద సూచించారు. హాస్టల్‌లో విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలని విద్యార్థినులు కోరగా, కలెక్టర్ సమక్షంలో తహసీల్దార్ రాజేశ్ స్పందించి తాను ఏర్పాటు చేయిస్తానన్నారు. కాగితాలతో తయారు చేసిన డ్రెస్‌ను ధరించిన విద్యార్థిని, పలు వేషధారణలు ధరించిన విద్యార్థినులను కలెక్టర్ అభినందించారు. విద్యార్థినులు ప్రదర్శించిన పిరమిడ్ విన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

వైద్య కళాశాల సందర్శన

వైద్యకళాశాలను కలెక్టర్ సతశారద సందర్శించారు. వైద్య కళాశాల విద్యార్థులకు రక్షణ కల్పించాలని, జిల్లా ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. వైద్యులు విద్యార్థులకు, రోగులకు అందుబాటులో ఉండాలని డాక్టర్‌లను ఆదేశించారు. ఆస్పత్రిలో మందుల కొరత, ఫర్నిచర్ వంటి సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో రామిరెడ్డి, డీఆర్‌డీవో కౌసల్య, స్పెషల్ ఆఫీసర్ భాగ్యలక్ష్మి, ఆర్డీవో ఉమారాణి, తహసీల్దార్ రాజేశ్, ఎంపీడీవో శ్రీనివాస్, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ మోహన్‌దాస్, ఇతర డాక్టర్లతో పాటు ఎస్సీ బాలుర హాస్టల్ వార్డెన్, బాలికల హాస్టల్ వార్డెన్, మునిసిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-3 పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు : కలెక్టర్

వరంగల్ కలెక్టరేట్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీఎస్‌పీఎస్‌సీ) ఆధ్వర్యంలో ఈనెల 17, 18 తేదీల్లో నిర్వహిస్తున్న గ్రూప్-3 పరీక్ష నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ సత్యశారద అధికారులకు సూచించారు. గురువారం వరంగల్ కలెక్టరేట్‌లో గ్రూప్-3 పరీక్ష నిర్వహణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరీక్షను ప్రశాంతంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు సమన్వయంతో పనిచేయాలన్నారు. పరీక్ష ఉదయం 10 నుంచి మధ్యా హ్నం 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు జరుగుతుంద న్నారు. వరంగల్ జిల్లాలో గ్రూప్-3 పరీక్షలకు 10,919 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని, అందుకు 28 సెంటర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 28 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 32మంది పరిశీలకులు, 82మంది బయోమెట్రిక్ ఇన్విజిలేటర్లు, ఐదుగురు రూట్ ఆఫీసర్లు, 28మంది డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులను నియమించామన్నారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌పీఎస్‌సీ రీజినల్ కోఆర్డినేటర్ బత్తిని చంద్రమౌళి, డీసీపీ రవీందర్, ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డీసీపీ రవి, ఏసీపీ నందిరాంనాయక్ తదితరులు పాల్గొన్నారు.

భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు



అమ్మవారిని దర్శించుకుంటున్న అధికారులు

వరంగల్ కల్చరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): వరంగల్‌లోని భద్రకాళి అమ్మవారిని గురువారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామాకాంత్ రెడ్డి, సీనియర్ ఫారెస్ట్ అధికారి, పీసీసీఎఫ్ సునీత భగవత్ వారి కుటుంబసభ్యులతో కలిసి వేర్వేరుగా అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రముఖుల రాక సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్నపన మండపంలో వేదపండితులు మహదాశీర్వచనం అందించి, అమ్మవారి శేష వస్త్రాలు, ప్రసాదం అందించినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శేషభారతి తెలిపారు.

ఆర్టీఏలో దళారులదే హవా

- నేరుగా వెళ్తే పనులు కావడం కల్ల
- బండికో రేటు వసూలు చేస్తున్న మధ్యవర్తులు
- చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు


వరంగల్ ఆర్టీఏ కార్యాలయం

ఖిలా వరంగల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా రవాణా కార్యాలయంలో దళారుల హవా నడుస్తోంది. బండికో రేటు పెట్టి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. రూ.3,000 నుంచి 10,000లు చెల్లిస్తే తప్ప వాహనాలకు రిజిస్ట్రేషన్ కావడంలేదు. బ్రోకర్లతో పాటు సెక్యూరిటీ, చిరుద్యోగులు సైతం అందినకాడికి దండుకుంటున్నారు.

ఆన్‌లైన్‌లో రుసుం చెల్లించి వాహనాల లైసెన్స్ కోసం ఆర్టీఏ కార్యాలయానికి వస్తే సిబ్బంది, అధికారులు వంద కొర్రీలు పెట్టి వాహనదారులను కార్యాలయం చుట్టూ తిప్పుతున్నారని పలువురు వాపోతున్నారు. వరంగల్ నాయుడు పెట్రోల్ పంపు వద్ద గల ఆర్టీఏ కార్యాలయానికి జిల్లా నలుమూలల నుంచి బైకులు, ఆటోలు, జీపులు, కార్లు, లారీలు, టిప్పర్లు, జేసీబీ, హార్వెస్టర్ తదితర భారీ వాహనాల రిజిస్ట్రేషన్ కోసం వస్తుంటారు. నూతనంగా వాహనాలు కొనుగోలు చేసిన వారు రుసుం చెల్లించి మొదటగా ఆర్టీఏ కార్యాలయంలో లర్నింగ్ (ఎల్ఎల్) తీసుకోవాలి. 30 రోజుల అనంతరం మళ్లీ ఆన్‌లైన్‌లో రుసుం చెల్లించి పర్మినెంట్ డ్రైవింగ్ లైసెన్స్ తీసుకోవాలి. ఇలాంటి వారు ప్రతీరోజు సుమారు 100 నుంచి 150 మంది కార్యాలయానికి వస్తుంటారు.

హెచ్ఆర్‌సీ ప్లేట్స్ కొరత..

గతంలో వాహనాలను కొనుగోలు చేసిన వాటికి హెచ్ఆర్‌సీ నెంబర్ ప్లేట్స్ లేకపోవడంతో వాహనాల రీసేల్ కావడం లేదు. దీంతో వాహనాదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కేంద్ర ప్రభుత్వం 2021 నుంచి నూతన పాలసీలో భాగంగా హైసెక్యూరిటీ నెంబర్ ప్లేట్స్ ఉండాలని నిబంధన పెట్టింది. దీంతో గతంలో వాహనం కొన్నవారు హెచ్ఆర్‌సీ నెంబర్ ప్లేట్ కోసం మధ్యవర్తులను సంప్రదిస్తే రెండు టైర్ల వాహనం అయితే రూ.3,000ల నుంచి రూ.5,000ల వరకు, అదేవిధంగా 4 టైర్ల వాహనం అయితే రూ.6,000ల నుంచి రూ.10,000లు తీసుకుంటున్నారు. ఈ విషయమై షోరూం వారిని సంప్రదిస్తే కొత్త వాహనాలకు మాత్రమే హెచ్ఆర్‌సీ నెంబర్ ప్లేట్స్‌ను ఇస్తున్నామంటున్నారు.

పాత వాహనాల విషయం తమకు తెలియదని చేతులు ఎత్తేస్తున్నారు. ఇక మోటారు వెహికిల్ అధికారులను సంప్రందిస్తే తమకు సంబంధం లేదంటున్నారు. ఇక లోన్‌ల ద్వారా వాహనాలు కొన్నవారు ఇన్‌స్టాల్‌మెంట్ చెల్లింపులు పూర్తైనా తమకు రెండునెలలుగా పర్మిషన్ రావడంలేదని వాపోతున్నారు.

వాహనదారుల ఇబ్బందులు..

వాహనాల రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన వారు లైన్‌లో క్యూ పద్ధతిని పాటించాలి. కాని మధ్యమధ్యన బ్రోకర్ల ఫారాలు పదుల సంఖ్యలో వస్తుంటాయి. అధికారులు సమయపాలన పాటించరు. గట్టిగా అడిగితే వాహనాల చెకప్, కలెక్టరేట్‌లో మీటింగ్ ఉందంటూ సాకులు చెబుతుంటారు. లేదా సిబ్బంది తక్కువగా ఉన్నారు. వాహనదారులు సహకరించాలి అంటారు. లేదంటే శిక్షార్హులవుతారని ఫ్లెక్సీలను చూపెడుతుంటారు.

గుంతలతో తంటాలు

నాయుడుపంపు నుంచి ఆర్టీఏ కార్యాలయానికి 500 మీటర్ల పొడవునా మోకాలులోతు గుంతలున్నాయి. కార్యాలయంలో సైతం మూడు నెలలక్రితం వర్షానికి ఏర్పడిన గుంతలను పూడ్చక పోవడంతో లైసెన్సు కోసం వచ్చేవారు ఇబ్బందులు పడుతున్నారు.

హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలి

ఆర్టీఏ కార్యాలయంలో తాగునీరు, మరుగుదొడ్లతో పాటు కనీస సమాచారం తెలిపే హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేయాలని బాధితులు కోరుతున్నారు. రిజిస్ట్రేషన్‌తో పాటు లైసెన్స్ కోసం వచ్చే వారికి సరైన సమాచారం లేక ఇబ్బంది పడుతున్నారు. సమాచాం తెలుసుకొనే లోగా సమయం దాటిపోవడంతో మళ్లీ కార్యాలయానికి రావాల్సి వస్తోందని వాహనదారులు వాపోతున్నారు.

రిజిస్ట్రేషన్ విధానం..

వాహనదారుడు కార్యాలయానికి వచ్చి ముందుగా గేట్ వద్ద బండి నెంబర్‌ను పేపర్‌పైన పెన్సిల్‌తో రఫ్ చేయించాలి. 2 వీలర్ నుంచి 24 టైర్ల వరకు బండికో ధర ఉంటుంది. అనంతరం కార్యాలయంలో 3వ నెంబర్ కౌంటర్‌లో రిజిస్ట్రేషన్ నెంబర్ వేయించుకోవాలి. తర్వాత 2, 4 వీలర్ వాహనదారులు 1వ నెంబర్ కౌంటర్‌లో ఫేస్ ఫొటో తీసుకుం టారు. అనంతరం డిజిటల్ సంతకం చేయాలి.

ఆ తర్వాత వాహనదారుడు ఎంవీఐ ముందు ట్రాక్‌పై వారి వాహనాన్ని ఒక రౌండ్ తిప్పి చూపించాలి. అయితే నిబంధనల ప్రకారం అన్ని ధ్రువపత్రాలు ఉంటే వందలో పది మందికి ఓకే చేస్తారు. మరికొందరు రాజకీయ పలుకుబడితో పనిచేయించుకుంటారు. మిగతా వారు మధ్యవర్తుల ద్వారా రావాల్సిందే. లేదంటే అనేక కొర్రీలు పెట్టి వాయిదా వేస్తారని వాహనదారులు చెబుతున్నారు.


వరంగల్ ఆర్టీఏ కార్యాలయంలో మూలన పడి తుప్పు పడుతున్న వాహనాలు


గుంతలు పడిన టెస్టింగ్ ట్రాక్

అంతర్జాతీయ కరాటే పోటీల్లో ప్రతిభ

వినిశ్రితకు బంగారు.. లౌక్యశ్రీకి వెండి పతకాలు


వినిశ్రిత, లౌక్యశ్రీలకు పతకాలు అందిస్తున్న నిర్వాహకులు

శంభునిపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ కరాటే పోటీల్లో వరంగల్ విద్యార్థులు ప్రతిభ చాటారు. గోకైడో కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 9 నుంచి 14 వరకు గోవాలో నిర్వహించిన అంతర్జాతీయ స్థాయి కరాటే పోటీల్లో 34 దేశాల క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో వరంగల్ జిల్లా కేంద్రంలోని రంగశాయిపేట టీచర్స్‌కాలనీకి చెందిన ప్రవీణ్ కుమార్-శ్రీకళల కుమార్తె తండ వినిశ్రిత అండర్-9 విభాగంలో ప్రతిభ కనబరిచి బంగారు పతకం సాధించింది. కుమ్మితే విభాగంలో లౌక్యశ్రీ ప్రతిభ చాటి వెండి పతకాన్ని కైవసం చేసుకుంది. ఆఫ్ఘనిస్తాన్, మలేషియా, బంగ్లాదేశ్, థాయ్‌లాండ్, భూటాన్, చైనా, నేపాల్, కొరియా క్రీడాకారులతో పోటీపడి ఫైనల్ రౌండ్స్‌లో ప్రతిభ చాటారు. ఈ సందర్భంగా నిర్వాహకులు వినిశ్రిత, లౌక్యశ్రీలకు మెడల్స్, పతకాలు అందించి సత్కరించారు.

గెలుపొందిన వినిశ్రిత, లౌక్యశ్రీలు రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో పతకాలు సాధించి గోవాలో నిర్వహించిన అంతర్జాతీయ చాంపియన్‌షిప్ పోటీలకు అర్హత సాధించారని కోచ్ తూముల పరమేశ్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ప్రముఖ కరాటే కోచ్, తెలంగాణ రాష్ట్ర షోటోకాన్ అధ్యక్షుడు ఊరుగొండ చంద్రశేఖర్, తెలంగాణ పోలీసు కరాటే కోచ్ పాయం సురేష్, గణపాక రవి, బైరి మహేందర్, చీకటి సమ్మయ్య, వనం శరత్‌బాబులు పతకాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. వినిశ్రిత, లౌక్యశ్రీలు ఈ ప్రాంతంతో పాటు తల్లిదండ్రులు, దేశానికి పేరు ప్రతిష్టలు తీసుకువచ్చారని కొనియాడారు.

కోటలో ఎన్ఎస్ఎస్ స్వచ్ఛ భారత్

ఖిలావరంగల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): సామాజిక సేవ, స్వచ్ఛ భారత్ వంటి కార్యక్రమాలలో విద్యార్థులు పాల్గొనాలని ఎస్ఆర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ అర్చనారెడ్డి అన్నారు. గురువారం ఖిలావరంగల్ మధ్యకోటలో మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా ఎస్ఆర్ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ కొప్పుల రవిందర్, ఆర్కియాలజీ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో 40 మంది విద్యార్థులు స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఖిలా వరంగల్ రాతికోటపై పెరిగిన ముళ్లపొదలు, పిచ్చిమొక్కలు, చెత్తా చెదారాన్ని విద్యార్థులు తొలగించారు. కార్యక్రమంలో ఎస్ఆర్ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ అధ్యక్షుడు శ్రీరాం, విద్యార్థులు సురేష్, శివాని, కేంద్ర పురావస్తు శాఖ ఖిలావరంగల్ కో-ఆర్డినేటర్ కొత్తపెల్లి శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

కోటను సందర్శించిన విద్యార్థులు

బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని పర్యాటక ప్రాంతమైన ఖిలావరంగల్ కోటను గురువారం విద్యార్థులు సందర్శించారు. తెలంగాణ యువ టూరిజం క్లబ్‌లో భాగంగా పాఠశాల విద్యార్థులు పర్యాటక ప్రాంతాలను సందర్శించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అందులో భాగంగా హనుమకొండలోని మర్కజీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఖిలావరంగల్ కోటను తిలకించారు. వారికి గైడ్ రవియాదవ్ కాకతీయుల కాలంనాటి చరిత్ర విశేషాలను వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


రాతికోటపై స్వచ్ఛ భారత్ నిర్వహిస్తున్న ఎస్ఆర్ వర్సిటీ విద్యార్థులు

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

డీఎంహెచ్‌వో డాక్టర్ సాంబశివరావు

పోచమ్మమైదాన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తూ ప్రభుత్వ లక్ష్యాన్ని సాధించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి.సాంబశివరావు అన్నారు. వరంగల్ నగరంలోని దేశాయిపేట పట్టణ ఆరోగ్య ప్రాథమిక కేంద్రాన్ని గురువారం డీఎంహెచ్‌వో ఆకస్మికంగా తనిఖీ చేశారు.

రికార్డులను పరిశీలించి, ప్రజలకు అందుతున్న సేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైద్య సిబ్బంది బాధ్యతగా వ్యవహరిస్తూ ఆరోగ్య సమాజం నిర్మాణానికి పాటుపడాలని అన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ మోహన్‌సింగ్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ భరత్‌కుమార్, సూపర్‌వైజర్ జన్ను కొర్నేలు, ఫార్మసిస్టు సంగ అనిల్‌కుమార్, రజియా, స్వర్ణలత, కుమారస్వామి, బుచ్చయ్య, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.


దేశాయిపేటలో రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

ట్రాఫిక్‌పై అవగాహన

కాశిబుగ్గ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబం ధనలపై గురువారం కాశిబుగ్గలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఓ ప్రైవేట్ పాఠశాల ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో ట్రాఫి క్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ హాజరై ట్రాఫిక్ నిబంధనలను వివరించారు. కాశిబుగ్గ కూడలిలో హెల్మెట్ పెట్టుకొని వెళ్తున్న వారికి పుష్పాలు విద్యార్థులతో అందించి అభినందించారు.

తగ్గిన బంగారం, వెండి ధరలు

వరంగల్ చౌరస్తా, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): బంగారం, వెండి ధరలు తగ్గుముఖం పట్టాయి. రెండు రోజుల నుంచి ఇదే ఒరవడి కొనసాగుతోంది. రాబోయే రోజుల్లో మరింత తగ్గే అవకాశాలున్నట్లు వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. దేశంలో బంగారం, వెండితో పాటు రాగి, అల్యూమినియం, మరికొన్ని లోహ వస్తువుల ధరలు కూడా తగ్గాయి. ప్రస్తుతం వివాహ ముహూర్తాలు, శుభకార్యాలు ఉన్నందున బంగారం, వెండి కొనుగోళ్లు జోరుగా సాగుతున్నాయి. కాగా, ధర మరింత తగ్గుతుందని, ఆ తరువాతే కొనుగోలు చేద్దామని వినియోగదారులు భావిస్తున్నారు.

రెండు రోజులుగా బంగారం ధరలు

సోమవారం బంగారం ధర తులానికి 79, 500లు ఉండగా, మంగళవారం నాటికి 77, 800లకు తగ్గింది. సోమవారం వెండి కిలో రూ.97,000 ఉండగా, మంగళవారం రూ.91. 000కి పడిపోయింది. ఒక్క రోజులోనే రూ.600 0లు ధర పడిపోయినందున వినియోగదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా జవహర్‌లాల్ నెహ్రూ జయంతి


వెంకట్రామ జంక్షన్‌లో నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ప్రకాష్


రంగశాయిపేటలో జయంతి వేడుకల్లో పాల్గొన్న నాయకులు

శంభునిపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆంగ్లేయుల పాలనలో అంధకారంలో ఉన్న భారతదేశాన్ని అనేక సంస్కరణలతో నవభారతంగా రూపొందించిన మహనీయుడు జవహర్‌లాల్ నెహ్రూ అని 42వ డివిజన్ కార్పొరేటర్ గుండు చందన పూర్ణచందర్ అన్నారు. నెహ్రూ జయంతి సందర్భంగా రంగశాయిపేట బొడ్రాయి సెంటర్‌లోని నెహ్రూ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కేడల పద్మ జనార్దన్, మంతిని సునిత, ఎలుగు సాంబేశం, రామ్మూర్తి, అనిల్, బషీర్, శ్రీనివాస్, రమేష్, చంద్రమౌళి, కుమార్, మల్లికార్జున్, హరిత, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు. 41వ డివిజన్ కార్పొరేటర్ పోశాల పద్మస్వామి ఆధ్వర్యంలో శంభునిపేట జంక్షన్‌లో జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని నిర్వహించారు. డివిజన్‌లోని స్టార్ కిడ్స్ పబ్లిక్ స్కూల్‌తో పాటు పలు పాఠశాలల్లో నిర్వహించిన బాలల దినోత్సవ వేడుకల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. అనేక ప్రాజెక్టులు కట్టించి వ్యవసాయ, పారిశ్రామికంగా దేశాన్ని అభివృద్ధి చేసిన తొలి ప్రధాని నెహ్రూ అని పోశాల పద్మ కొనియాడారు.

గిర్మాజిపేటలో..

గిర్మాజిపేట : నెహ్రూ జయంతిని గురువారం వరంగల్‌లోని వెంకట్రామా జంక్షన్‌లో టీపీసీసీ నాయకుడు మీసాల ప్రకాష్, మాజీ కార్పొరేటర్ జారతి రమేష్ ఘనంగా నిర్వహించారు. ముందుగా నెహ్రూ చిత్రపటానికి వారు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. తొలి ప్రధానిగా పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ గణనీయమైన కృషి చేశారన్నారు. దేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు నెహ్రూ పంచవర్ష ప్రణాళికలు రూపొందించి అమలు చేయడం ద్వారా ప్రపంచంలో భారతదేశానికి గుర్తింపు తెచ్చారని కాంగ్రెస్ నాయకులు ప్రకాష్, రమేష్ గుర్తు చేశారు. నెహ్రూ అభివృద్ధి వరంగల్ జిల్లాలోనూ ఉందని, ఎన్ఐటీ, కాకతీయ వైద్య కళాశాల, మామునూరు ఎరోడ్రమ్ నెహ్రూ వేసిన ఫలాలేనని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సందెల లాజర్, కమల్, జస్వీర్‌సింగ్, అన్వేష్, దొడు నాగరాజు, సందీప్, జ్యోతి, శ్రీను, రవి, శ్రీదేవి, శారద, శంకర్, భిక్షపతి, కుమారస్వామి, లావణ్య, జహీరా, శ్రీదేవి, పద్మ, రజియా, వెంకటేశ్వర్‌రావు, రామకృష్ణ, విశాల్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

అనాథ ఆశ్రమానికి నిత్యావసరాలు అందజేత

శంభునిపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): 41వ డివిజన్ ఉర్సు నాగేంద్రనగర్‌లోని ఏసుక్రీస్తు విశ్వాసుల సహవాసము చర్చి 32వ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఫాతిమానగర్‌లో డివైన్ మెర్సీ హోమ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అనాథ ఆశ్రమానికి రూ.50వేల విలువైన నిత్యావసర సరుకులు, దుప్పట్లు, గ్రైండర్ అందించారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ నిర్వాహకురాలు ఫర్హానా, లెహమియా, బిషప్, సంఘ సలహాదారులు కలకోట్ల మాణిక్యం, అధ్యక్షుడు కలకోట్ల షడ్రల్‌గుండేటి సెక్రెటరీ వేల్పుకొండ డేవిడ్, జాయింట్ సెక్రెటరీ కలకోట్ల భరత్, కోశాధికారి రేణికుంట్ల రాజు, కోట ఆనందరావు, దున్నాల అకుల, కలకోట్ల సంజీవ, యాకోబు, గుండేటి ఏలియా తదితరులు పాల్గొన్నారు.


అనాథ పిల్లలకు నిత్యావసరాలు అందిస్తున్న చర్చి నిర్వాహకులు

కష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్తు

- విద్యార్థులతో వరంగల్ కలెక్టర్ సత్యశారద
- నర్సంపేటలో ఎస్సీ బాలుర విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ
- బాలికల హాస్టల్‌లో స్ఫూర్తి కార్యక్రమానికి హాజరు
- వైద్య కళాశాలలో వసతులు కల్పించాలని సూచన



నర్సంపేటలో సర్వేను పరిశీలించి ఎన్యూమరేటర్‌తో మాట్లాడుతున్న కలెక్టర్ సత్య శారద

నర్సంపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కష్టపడి చదివితేనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని వరంగల్ కలెక్టర్ సత్య శారద అన్నారు. బాలల దినోత్సవం సందర్భంగా నర్సంపేట పట్టణంలోని ఎస్సీ హాస్టల్‌లో రిటైర్డ్ రెవెన్యూ ఉద్యోగులు అందించిన దుప్పట్లు (రగ్గులు)ను హాస్టల్ విద్యార్థులకు అధికారులతో కలిసి పంపిణీ చేశారు. కొద్ది సేపు విద్యార్థులతో ముచ్చటించారు. ఉన్నత చదువులు చదివాక ఎలాంటి ఉద్యోగం చేస్తారని విద్యార్థులను అడిగి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. హాస్టల్‌లో ఇబ్బందులున్నా, ఏమైనా సమస్యలుంటే కాగితంపై రాసి ఫిర్యాదుపెట్టెలో వేస్తే పరిష్కరిస్తామని కలెక్టర్ విద్యార్థులకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా హాస్టల్ గదులను కలెక్టర్ పరిశీలించారు. ఇదే హాస్టల్ సమీపంలో మునిసిపాలిటీ ఆధ్వర్యంలో ఎన్యూమరేటర్లు నిర్వహిస్తున్న కుటుంబ సర్వేను కలెక్టర్ పరిశీలించారు. కుటుంబ వివరాలను నమోదు చేస్తున్న ఫారాలను నిశితంగా పరిశీలించి సర్వేను పారదర్శకంగా చురుకుగా నిర్వహించాలని సూచించారు.

సమగ్ర కుటుంబ సర్వే పరిశీలన

పట్టణంలోని సర్వాపురం శివారులోని బాలికల హాస్టల్‌ను కలెక్టర్ సందర్శించారు. బాలల దినోత్సవం సందర్భంగా జిల్లాలో ప్రప్రథమంగా బాలికల హాస్టల్‌లో స్ఫూర్తి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ సత్యశారద మాట్లాడుతూ.. సెల్‌ఫోన్ అలవాట్లను మానుకొని పట్టుదలతో చదివితే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. తాము చదువుకున్న సమయంలో ఎలాంటి వసతులు లేవని, ఎన్నో ఎదురుదెబ్బలు తిని చదువుకొని కలెక్టర్ స్థాయికి వచ్చామని విద్యార్థులకు వివరించారు. ఇప్పుడు అన్ని రకాల సౌకర్యాలు ఉన్నాయని, చదువు విలువను గుర్తించి విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కలెక్టర్ సత్యశారద సూచించారు. హాస్టల్‌లో విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలని విద్యార్థినులు కోరగా, కలెక్టర్ సమక్షంలో తహసీల్దార్ రాజేశ్ స్పందించి తాను ఏర్పాటు చేయిస్తానన్నారు. కాగితాలతో తయారు చేసిన డ్రెస్‌ను ధరించిన విద్యార్థిని, పలు వేషధారణలు ధరించిన విద్యార్థినులను కలెక్టర్ అభినందించారు. విద్యార్థినులు ప్రదర్శించిన పిరమిడ్ విన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

వైద్య కళాశాల సందర్శన

వైద్యకళాశాలను కలెక్టర్ సతశారద సందర్శించారు. వైద్య కళాశాల విద్యార్థులకు రక్షణ కల్పించాలని, జిల్లా ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. వైద్యులు విద్యార్థులకు, రోగులకు అందుబాటులో ఉండాలని డాక్టర్లను ఆదేశించారు. ఆస్పత్రిలో మందుల కొరత, ఫర్నిచర్ వంటి సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో రామిరెడ్డి, డీఆర్‌డీవో కౌసల్య, స్పెషల్ ఆఫీసర్ భాగ్యలక్ష్మి, ఆర్డీవో ఉమారాణి, తహసీల్దార్ రాజేశ్, ఎంపీడీవో శ్రీనివాస్, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ మోహన్‌దాస్, ఇతర డాక్టర్లతోపాటు ఎస్సీ బాలుర హాస్టల్ వార్డెన్, బాలికల హాస్టల్ వార్డెన్, మునిసిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-3 పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు : కలెక్టర్

వరంగల్ కలెక్టరేట్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీఎస్‌పీఎస్‌సీ) ఆధ్వర్యంలో ఈనెల 17, 18 తేదీల్లో నిర్వహిస్తున్న గ్రూప్-3 పరీక్ష నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ సత్యశారద అధికారులకు సూచించారు. గురువారం వరంగల్ కలెక్టరేట్‌లో గ్రూప్-3 పరీక్ష నిర్వహణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరీక్షను ప్రశాంతంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు సమన్వయంతో పనిచేయాలన్నారు. పరీక్ష ఉదయం 10 నుంచి మధ్యా హ్నాం 12.30 గంటల వరకు, మధ్యాహ్నాం 3 నుంచి 5 గంటల వరకు జరుగుతుంద న్నారు. వరంగల్ జిల్లాలో గ్రూప్-3 పరీక్షలకు 10,919 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని, అందుకు 28 సెంటర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 28 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 32మంది పరిశీలకులు, 82మంది బయోమెట్రిక్ ఇన్విజిలేటర్లు, ఐదుగురు రూట్ ఆఫీసర్లు, 28మంది డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులను నియమించామన్నారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌పీఎస్‌సీ రీజినల్ కోఆర్డినేటర్ బత్తిని చంద్రమౌళి, డీసీపీ రవీందర్, ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డీసీపీ రవి, ఏసీపీ నందిరాంనాయక్ తదితరులు పాల్గొన్నారు.

భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు



అమ్మవారిని దర్శించుకుంటున్న అధికారులు

వరంగల్ కల్చరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): వరంగల్‌లోని భద్రకాళి అమ్మవారిని గురువారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామాకాంత్ రెడ్డి, సీనియర్ ఫారెస్ట్ అధికారి, పీసీసీఎఫ్ సునీత భగతవ్ వారి కుటుంబసభ్యులతో కలిసి వేర్వేరుగా అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రముఖుల రాక సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్నపన మండపంలో వేదపండితులు మహదాశీర్వచనం అందించి, అమ్మవారి శేష వస్త్రాలు, ప్రసాదం అందించినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శేషభారతి తెలిపారు.



రైతు వేదికలోకి వ్యవసాయ కార్యాలయం మార్పు

సంగెం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయాన్ని రైతు వేదిక భవనంలోకి గురువారం మార్చారు. వ్యవసాయ శాఖ భవనం శిథిలావస్థకు చేరుకోగా, వర్షానికి కార్యాలయంలోని రిజిస్టర్లు తడిసి ముద్దకావడంతో పాటు కార్యాలయం స్లాబుకు ఉన్న పెచ్చులు ఊడి పడుతుండడంతో స్థానిక రైతు వేదిక భవనంలోకి తరలించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి యాకయ్య మట్లాడుతూ వ్యవసాయ కార్యాలయం శిథిలావస్థకు చేరుకొని కూలడానికి సిద్ధంగా ఉండటంతో అధికారుల సూచనల మేరకు కార్యాలయంను మార్చినట్లు చెప్పారు. ట్రాక్టర్‌లో ఫర్నిచర్, రిజిస్టర్లను తరలించినట్లు, ఇక నుంచి రైతు వేదిక భవనంలో విధులు నిర్వర్తించనున్నట్లు తెలిపారు. మండల ప్రజలందరు కార్యాలయ మార్పును గమనించాలని కోరారు.

జిల్లాలో 80వేల ఇళ్లలో పూర్తయిన సర్వే

• కలెక్టర్ సత్య శారద



ఖానాపురంలో సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ సత్య శారద

ఖానాపురం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో కొనసాగుతున్న ఇంటింటి సమగ్ర సర్వేను కలెక్టర్ సత్య శారద గురువారం పరిశీలించారు. ఎన్యుమరేటర్లు వివరాలు సరిగా నమోదు చేస్తున్నారా లేదా అనే విషయాలను పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 2.8లక్షల ఇండ్లు ఉండగా ప్రస్తుతానికి 80వేల ఇండ్లలో సర్వే పూర్తయినట్లు ఆమె తెలిపారు. ఎన్యుమరేటర్లకు ప్రజలు సహకరించి వివరాలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో రాంరెడ్డి, ఆర్డీవో ఉమారాణి, తహసీల్దార్ కిరణ్‌కుమార్, ఎంపీడీవో భారతి, ఎంపీవో సునీల్ పాల్గొన్నారు.

ద్వారకపేట శ్మశాన వాటికకు దారి ఏర్పాటు చేయాలి

నర్సంపేట (ఆంధ్రజ్యోతి) : మునిసిపల్ పరిధిలోని ద్వారకపేటలోని స్మశానవాటికకు దారిని ఏర్పాటు చేయాలని కోరుతూ ద్వారకపేటకు చెందిన జిన్నింగ్ మిల్ యజమాని మొట్ల రాజిరెడ్డి, అతడి సతీమణి జిల్లా కలెక్టర్ సత్య శారదకు గురువారం వినతిపత్రాన్ని అందజేశారు. తమ పట్టా భూమి నుంచి స్మశాన వాటికకు వెళ్లడం వల్ల ఇబ్బందులు కలుగుతున్నాయని, ఏడాది కాలంగా దారి సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని, వెంటనే శ్మశాన వాటికకు దారిని ఏర్పాటు చేయాలని కోరగా తహసీల్దార్ రాజేశ్‌ను సర్వే చేయించి దారి ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ రైతు మృతి



భాస్కర్ రెడ్డి (ఫైల్)

దుగ్గొండి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ రైతు మృతి చెందిన సంఘటన మండలంలోని మహ్మదాపురంలో గురువారం చోటుచేసుకొంది. కుటుంబికులు, పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని మహ్మదాపురం గ్రామానికి చెందిన గోగుల భాస్కర్‌రెడ్డి(38) వ్యవసాయం చేస్తూ జీవనం గడుపుతాడు. గోగుల భాస్కర్‌రెడ్డి వ్యవసాయం చేస్తున్న క్రమంలో పంటలు పండక అప్పులు అయ్యాయి. దీంతో తనకు ఉన్న 20గుంటల భూమి అమ్మి అప్పులు తీర్చాడు.అయినా అప్పులు తీరకపోవడంతో భాస్కర్ రెడ్డి మనస్థాపం చెంది తాగుడుకు బానిసయ్యాడు. ఈ నెల 2న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగగా, బంధువులు చికిత్స కోసం వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తీసుకపోయారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుడి భార్య మమత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో కార్యదర్శికి తీవ్ర గాయాలు

చెన్నారావుపేట, నవంబరు 14: (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో పంచాయతీ కార్యదర్శికి తీవ్ర గాయాలపాలైన సంఘటన మండలంలోని కేంద్రంలో శివారులో గురువారం చోటుచేసుకుంది. గ్రామస్థుల కథనం ప్రకారం.. మండలంలోని పాపయ్యపేట, పదహారు చింతల్ గ్రామాల పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తున్న కత్తరపల్లి రాజు విధులు ముగించుకొని తన ద్విచక్ర వాహనంపై ఇంటికి తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో చెన్నారావుపేట గ్రామ శివారు ప్రాంతంలో ప్రమాదవశాత్తు వాహనానికి ఎదురుగా కుక్క అడ్డురావటంతో కిందపడ్డాడు. దీంతో రాజు కాలు విరగడంతో వెంటనే నర్సంపేటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

రేషన్ బియ్యం, నల్ల బెల్లం పట్టివేత

నెక్కొండ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పల్‌రావుపేటలోని రైస్‌మిల్లులో అక్రమంగా నిలువఉన్న రెండు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నట్లు ఎస్సై మహేందర్ గురువారం తెలిపారు. బియ్యం విలువ రూ.5 వేలు ఉంటుందని, బియ్యం విక్రయించిన మండలంలోని మడిపల్లికి చెందిన బానోతు హరిసింగ్, కొనుగోలుచేసిన మిల్లు యజమాని ఆనంద్‌పై కేసు నమోదుచేశామన్నారు. బియ్యం తీసుకువచ్చిన టీవీఎస్ ఎక్సెల్ టూ వీలర్‌ను స్వాధీన పర్చుకున్నామన్నారు.అలాగే రెడ్లవాడలోని కిరణ్‌కుమార్ ఇంట్లో నిలువ ఉంచిన రూ.32,300 విలువైన నల్లబెల్లం, పటికబెల్లం పట్టుకుని కిరణ్‌కుమార్‌పై కేసునమోదు చేశామన్నారు.

దుబ్బాతండాలో వివాహిత అదృశ్యం

చెన్నారావుపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అమీనాబాద్ గ్రామ శివారు దుబ్బాతండాకు చెందిన ఓ వివాహిత మహిళ అదృశ్యమైనట్లు ఏఎస్ఐ లక్ష్మణమూర్తి గురవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఇదే తండాకు చెందిన జాటోతు సింధూ (29) అనే వివాహిత గత నెల 9న భార్య భర్తల మధ్య గొడవ కావటంతో ఇంట్లో చెప్పకుండానే ఇంట్లో నుంచి వెళ్లి పోయింది. అప్పటినుంచి బంధువుల ఇంట్లో, చుట్టు పక్కల గ్రామాల్లో వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో భర్త జాటోతు దీపక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

వరి ధాన్యాన్ని వెంటనే కోనుగోలు చేయాలి

వర్ధన్నపేట, నవంబర్ 14 (ఆంధ్రజ్యోతి) : రైతులు పండించిన ధాన్యంను ప్రభుత్వం వెంటనే కోనుగోలు చేయాలని అఖిలభారత రైతు కూలి సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాచర్ల బాలరాజు ప్రభుత్వాని డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం జిల్లాలో ఐకేపి, పిఏసిఎస్ ఆధ్వర్యంలో కోపుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి పది రోజులు గడిచినప్పటికి ధాన్యం మాత్రం కోనుగోలు చేయడం లేదన్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని కోనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి రోజుల తరబడి ఆరబోసి ఎదురున్తున్నప్పటికీ ప్రభుత్వం వివిధ కారాణలతో ధాన్యం కోనుగోలులో జాప్యం చేయడం సబబుకాదన్నారు.

కాంటాలు సజావుగా జరిగేలా చూడాలి

రాయపర్తి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : రైతులు తెచ్చిన ధాన్యాన్ని నిబంధనలను అనుగుణంగా కాంటాలు సజావుగా జరిగేలా చూడాలని డీఆర్డీవో పీడీ కౌసల్య దేవి సూచించారు. గురువారం మండలంలోని రాగన్నగూడెం, పెర్కవేడు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

దుగ్గొండి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని మధ్యాహ్న భోజనాన్ని గురువారం మండల ప్రత్యేక అధికారి సంగీతలక్ష్మీ, ఎంపీడీవో అరుంధతిలు సందర్శించి తనిఖీ చేశారు. మెనూ ప్రకారం పిల్లలకు భోజనం వడ్డించాలని వంట మనుషులకు ఆదేశించారు. తనిఖీ సమయంలో హెచ్‌ఎం రామస్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరస్పర సహకారం ప్రగతికి సోపానం

ఖానాపురం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : పరస్పర సహకారంతోనే ప్రగతి సాధ్యమని, సహకార స్ఫూర్తిని అందిపుచ్చుకుంటే అసాధ్యమనేది ఉండదని ఓడీసీఎంఎస్ చైర్మన్ గుగులోతు రామస్వామినాయక్ అన్నారు. సహకార వారోత్సవాలను పురస్కరించుకొని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో సహకార జెండాను రామస్వామినాయక్ ఆవిష్కరించారు.

మండల పూజా మహోత్సవం ప్రారంభం

ఆలయ సేవా ట్రస్టు చైర్మన్ శింగిరికొండ మాధవశంకర్

జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహాన్నదానం



అన్నపూజ చేస్తున్న అయ్యప్ప భక్తులు, రైస్ మిల్లర్లు

నర్సంపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శ్రీధర్మశాస్త్రా అయ్యప్పస్వామి దేవాలయంలో ఈ నెల 14నుంచి డిసెంబరు 26 వరకు 24వ (చతుర్వింశతి) మండల పూజా మహోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నట్లు అయ్యప్ప స్వామి సేవా చారిటబుల్ ట్రస్టు చైర్మన్ శింగిరికొండ మాధవశంకర్ అన్నారు. ఆలయం ఆవరణలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో కరపత్రాలను ఆవిష్కరించాక ఆయన మాట్లాడారు. ఈ నెల 14న సుప్రభాత సేవ, మహా గణపతి హోమ పూజలతో మండల పూజా మహోత్సవం ప్రారంభమైందన్నారు. ఇదే రోజు మధ్యాహ్నం 12.30 గంటలకు వరంగల్ జిల్లా రైస్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు తోట సంపత్ కుమార్, కార్యదర్శి బండారి దామోదర్, కోశాధికారి తక్కళ్లపల్లి యుగంధర్ రావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు దేవునూరి అంజయ్య, గోనెల రవీందర్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఇరుకు కోటేశ్వర్‌రావులచే మహాన్నదాన కార్యక్రమం ప్రారంభించామన్నారు. ఆహ్వానితులుగా నర్సంపేట రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గందం నరేందర్, కోశాధికారి కురంగడ్ల రవి, హన్మకొండ జిల్లా రైస్ మిల్లర్స్ అసోషియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పెద్ది ప్రవీణ్ కుమార్, మాటేటి రాధిక ప్రదీప్ చైతన్య, కోశాధికారి చౌళ్ల లక్ష్మణ్, సలహాదారులు ఎర్రబెల్లి వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారని తెలిపారు నవంబరు 15న కార్తీక పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు, ఉదయం 9.30 గంటలకు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రత పూజలు, మధ్యాహ్నం 12.30 గంటలకు మహాన్నదాన కార్యక్రమం కిరాణ వర్తక సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తారని అన్నారు. డిసెంబరు 3న పుష్పాభిషేకం, దివ్య పడిపూజ జరుగుతుందన్నారు. డిసెంబరు 8న ఉత్సవబలి, క్షేత్రబలి, పల్లివేట, డిసెంబరు 9న నర్సంపేట మండలం మాధన్నపేట చెరువులో అయ్యప్ప స్వామికి (జల క్రీడ) పంబారట్టు ఉత్సవ పూజలను తాంత్రిక పద్ధతిలో నిర్వహిస్తారన్నారు. డిసెంబరు 26 మండల పూజల ముగింపు మహోత్సవం జరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో అయ్యప్పదేవాలయ కమిటీ అధ్యక్షుడు పైస సురేశ్, కార్యదర్శి చింతల కమలాకర్‌రెడ్డి, మాదారపు చంద్రశేఖరం, శ్రీరాం ఈశ్వరయ్య, కోడెం భూపాల్‌రావు, భూపతి లక్ష్మీనారాయణ. చకిలం కృష్ణమూర్తి పుల్లూరి స్వామి, శ్రీరాముల శంకర య్య ఇరుకుల్ల వీరలింగం, మోతె జైపాల్‌రెడ్డి అయ్యప్ప మాలాదారులు తదితరులు పాల్గొన్నారు.

నెహ్రూ సేవలు మరువలేనివి



నర్సంపేటలో నెహ్రూ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నర్సంపేట టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : భారతదేశ తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ దేశానికి చేసిన సేవలు మరువలేనివని నర్సంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి తక్కళ్లపల్లి రవీందర్‌రావు, మునిసిపాలిటీ కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ వేముల సాంబయ్య అన్నారు. పట్టణంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు బత్తిని రాజేందర్ ఆధ్వర్యంలో జవహర్‌లాల్ నెహ్రూ 135వ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చింతల సాంబరెడ్డి, పాలాయి రవికుమార్, విజయ్, మధన్, మురళి, సాంబయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు

నెహ్రూ జయంతిని పురస్కరించుకొని బాలల దినోత్సవ వేడుకలను పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. గురిజాలలోని జడ్‌పీహెచ్ఎస్ పాఠశాలలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం పెద్దిరెడ్డి అర్పిత ఆధ్వర్యంలో బాలల దినోత్సవ వేడుకలను నిర్వహించారు. విద్యార్థులు చాచా నెహ్రూ వేషధారణ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

• వర్ధన్నపేట రూరల్ (ఆంధ్రజ్యోతి): మండలంలోని ల్యాబర్తి గ్రామ ప్రభుత్వ పాఠశాలలో చిల్డ్రన్స్ డేను పురస్కరించుకుని జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి హెచ్‌ఎం బాలకిషన్ నివాళులర్పించారు. కార్యక్రమంలో పీఈటీ రఘువీర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

• దుగ్గొండి (ఆంధ్రజ్యోతి) : దుగ్గొండి హై స్కూల్‌లో మండల ప్రత్యేక అధికారి, జిల్లా ఉద్యానాధికారి సంగీత లక్ష్మీ, ఎంపీడీవో అరుంధతిలు పాల్గొని నెహ్రూ చిత్ర పటానికి నివాళులు అర్పించారు. మండలంలోని మల్లంపల్లిలో హెచ్‌ఎం భద్రమ్మ, మహ్మదాపురంలో ఉపాధ్యాయులు ఘనంగా బాలల దినోత్సవం నిర్వహించారు.

• ఖానాపురం (ఆంధ్రజ్యోతి): బాలల దినోత్సవ వేడుకలను పురష్కరించుకొని బుధరావుపేటలో మోడల్ మాదిరి పోలింగ్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఎస్సై రఘుపతి, ఎంఈవో శ్రీదేవి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అశోక్‌నగర్ గిరిజన సైనిక్ స్కూల్‌లో స్వయం పాలన దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో బుధరావుపేట ప్రిన్సిపాల్ ఆరిఫ్ హుస్సేన్, సైనిక్ స్కూల్ ప్రిన్సిపాల్ సురేందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

• గీసుగొండ (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మోడల్ పాఠశాల, కస్తూర్బా బాలికా విద్యాలయంలో విద్యార్థులచే పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సునిత, హిమబిందు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

• నెక్కొండ (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ప్రభుత్వ హై స్కూల్, పీఎస్‌లలో చాచా నెహ్రూ జయంతి అంటే పిల్లల పండుగ అంటూ ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు.

• చెన్నారావుపేట (ఆంధ్రజ్యోతి): మండలంలోని బోజేర్వు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని కస్తూర్బా గురుకులంలో నేషనల్ హ్యూమన్ రైట్స్ వారి ఆధ్వర్యంలో విద్యార్థులకు మండల స్థాయిలో విద్యార్థుల హక్కులపై వ్యాస రచన పోటీలను నిర్వహించారు. ఎంపీడీవో శ్రీవాణి, అబ్దుల్‌కలాం ఫౌండేషన్ అధ్యక్షుడు బాషమీయా, ఎస్‌వో జ్యోతి విద్యార్థులకు బహుమతులు అందించారు.

రాష్ట్రస్థాయిలో ద్వితీయ బహుమతి సాధించిన విద్యార్థిని



బహుమతి అందుకుంటున్న హరిప్రియ

చెన్నారావుపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఉప్పరపల్లి గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న కల్లెపు హరిప్రియ వచన కవితల పోటీలో రాష్ట్రస్థాయిలో ద్వితీయ బహుమతిని సాధించినట్లు హెచ్‌ఎం జయ గురువారం తెలిపారు. తెలంగాణ సాహిత్య అకాడమి, నాటక సంగీత అకాడమి వారి ఆధ్వర్యంలో హైదరబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ ఆడిటోరియంలో బాలల దినోత్సవా న్ని పురస్కరించుకొని జరిగిన కార్యక్రమంలో ప్రము ఖ కవి అందెశ్రీ, అకాడమి చైర్మన్ డాక్టర్ అలేఖ్య పుంజుల నగదు బహుమతితో పాటు సర్టిఫికెట్‌లను అందించారు. ఈ సందర్భంగా విద్యార్థిని పలువురు అభినందించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు గొర్రెకుంట విద్యార్థులు



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

గీసుగొండ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): వరంగల్ ఓసిటీలో ఇటీవల నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో గొర్రెకుంట జడ్పీపాఠశాల విద్యార్థిని సౌమ్య ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం జ్యోతిర్మయి, పీఈటీ హేమలత తెలిపారు. ఈనెల 16 నుంచి 18 వరకు మెదక్ జిల్లా చేగుంటలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో సౌమ్య పాల్గొననున్నట్లు చెప్పారు. ఇదే పాఠశాలలో చదువుతున్న అక్షయ్, స్వదీప్, అనూష్‌లు బేస్‌బాల్‌లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను గురువారం పాఠశాలలో ఉపాధ్యాయులు అభినందించారు.

రెవెన్యూ ఉద్యోగుల నిరసన

సంగెం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లా కలెక్టర్, ఉద్యోగుల పై జరిగిన దాడికి నిరసనగా మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట రెవెన్యూ ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి గురువారం నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ రాజ్‌కుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ..

గీసుగొండ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగదేవిపల్లి జడ్పీ పాఠశాలలో గురువారం స్వయంపరిపాలన దినోత్సవాన్నినిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించిపాఠాలు బోధించారు. బోధనలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు హెచ్‌ఎం రజాక్ బహుమతులు అందచేశారు.

ఆరోగ్యానికి తగిన జాగ్రత్తలు పాటించాలి

వర్ధన్నపేట, నవంబర్ 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఆరోగ్యం పట్ల తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు పాటించాలని వర్ధన్నపేట ఏరియా ఆస్పత్రి ఆర్‌ఎంవో విజయ్ సూచించారు. చిల్డ్రన్స్ డే సందర్భంగా వర్ధన్నపేట పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో దంత వైద్య నిపుణులు భరత్‌రెడ్డి, అర్జల ఆధ్వర్యంలో హెల్త్ క్యాంప్ నిర్వహించారు. కార్యక్రమానికి ప్రభుత్వం ఏరియా ఆస్పత్రి ఆర్‌ఎంవో విజయ్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై వైద్యులు ఉపాధ్యాయులతో కలిసి హెల్త్ క్యాంప్ ప్రారంభించారు. విద్యార్థులకు చిల్డ్రన్స్ డే శుభాకాం క్షలు తెలిపారు. వైద్యులు విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో దంత వైద్య నిపుణులు అపర్ణ, భరత్‌రెడ్డి, పిల్లల వైద్య నిపుణురాలు శైలజ మాట్లాడగా, ఉపాధ్యాయులు బుల్యాబేట్రిస్, రాజకుమారి, అనిత, రహీం, శ్రీనివాస్, సురేష్, సుమన్ పాల్గొన్నారు.

న్యూమోనియా పట్ల అప్రమత్తంగా ఉండాలి

చెన్నారావుపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : చిన్న పిల్లలు న్యూమోనియా వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ సరోజ అన్నారు. గురువారం మండలంలోని సూరిపల్లిలో చిన్నారులకు ఉచిత వైద్య శిబిరంను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చంటి పిల్లలకు చల్లని పదార్థాలు పానీయాలు అందించవద్దన్నారు. చలికాలం ఉదయం, సాయంత్రం వేళల్లో ఆరుబయట తిరుగరాదన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ కీర్యానాయక్, ఏఎన్‌ఎం సుధారాణి, అంగన్‌వాడీ టీచర్ స్వరూప, నిర్మల శోభారాణి, పూలమ్మ, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రగతిని తల్లిదండ్రులకు వివరించాలి

గీసుగొండ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రతీ పాఠశాలలో పేరెంట్స్, టీచర్స్ సమావేశం(పీటీఎం)ను ప్రతి నెల నిర్వహించి విద్యార్థుల విద్యా ప్రగతిని, వారి నడవడికను తల్లిదండ్రులకువివరించాలని జిల్లా సెక్టోరియల్ అధికారి సుభాష్ అన్నారు. మండలంలోని ధర్మారం జడ్పీ పాఠశాలలో గురువారం నిర్వహించిన పీటీఎంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సమావేశంలో ఎంఈవో సాంబయ్య, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం

నల్లబెల్లి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోగుల రాణాప్రతాప్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు బొద్దిరెడ్డి ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన పార్టీ సంస్థాగత ఎన్నికల సమావేశంలో ముఖ్య అతిథిగా రాణాప్రతాప్‌రెడ్డి మాట్లాడారు. ఇప్పటివరకు మండలంలో సభ్యత్వ నమోదు కార్యక్రమానికి కృషి చేసిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. నర్సంపేట నియోజకవర్గంలోని అన్ని మండలాల్తో పోలిస్తే నల్లబెల్లి మండలంలో అత్యధిక సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగిందన్నారు.